క్లుప్తంగా

ప్రమోషన్ పొందిన టీచర్ల జాబితా అందజేత

నర్సాపూర్: ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుల జాబితాను ఎస్‌టీఓ శ్రీనివాస్‌కు శుక్రవారం అప్పగించామని పీఆర్‌టీయూ మండల జిల్లా కార్యదర్శి వీరేశం, ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్‌లు తెలిపారు. ఇటీవల లాంగ్వేజ్ పండిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందారని చెప్పారు. ప్రమోషన్ పొందిన వారి జాబితాను ఎస్‌టీఓకు అందజేసి రికార్డులను అప్‌గ్రేడ్ చేయాలని కోరినట్లు తెలిపారు. వారి వెంట యూనియన్ నాయకులు శ్రీకాంత్, కీరురాథోడ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో మీ సేవా కోసం మహిళా గ్రూపు సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ గ్రూపులో సభ్యురాలిగా ఉండటంతోపాటు గ్రామ కోడలై ఉండాలన్నారు. బ్యాంకులో ఎలాంటి రుణబకాయిలు ఉండకూడదన్నారు. ఇంటర్ పాసైన వారు అర్హులని చెప్పారు. మీ సేవా మంజూరైన మహిళకు రూ.2 లక్షల రుణం ఇస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు రెండు రోజుల్లో ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆధునిక సాగు విధానం చేపట్టాలి



వెదజల్లే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ లావణ్య

శివ్వంపేట(నర్సాపూర్): పంటల సాగులో రైతులు ఆధునిక విధానాలు అలవర్చుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నాపూర్‌లో వెద జల్లే విధానంపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దమ్ము చేసిన నేలలో ముక్కు పగిలిన వరి విత్తనాలను ఎకరానికి 10 నుంచి 12 కిలోలను వెదజల్లే పద్ధతి ద్వారా వేస్తే సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. తద్వారా ఎకరాకు కూలి, ఇతర ఖర్చులు 8 నుంచి 10 వేల వరకు ఆదా అవుతుందని చెప్పారు. సమయం ఆదాతోపాటు పంట ముందుగా చేతికొస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మాజిద్ అలీ, రైతులు ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నేతలు



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీజేపీ నార్సింగి మండలం పెద్దతండా నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): గోమాత రక్షణకు పోరాడి జైలుకు వెళ్లిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌ను బీజేపీ నార్సింగి మండల పెద్దతండా నాయకులు కలిసి అభినందించారు. శుక్రవారం మెదక్‌లో శ్రీనివాస్‌ను కలిసి శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నార్సింగి మండల సీనియర్ నాయకులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డితో పాటు పెద్దతండా బీజేపీ అధ్యక్షుడు వసురామ్, ఉపాధ్యక్షుడు నితిన్, సోంరాజ్, అశోక్, సుభాష్‌లు ఉన్నారు.

మీ సేవలు మరువలేం



ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిస్తున్న తోటి టీచర్లు

నిజాంపేట(మెదక్): మీ సేవలు మరువలేమని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలను తోటి టీచర్లు కొనియాడారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంపూర్‌లో పనిచేసిన టీచర్లు రమేశ్ బాబు, శ్రీనివాస్‌లకు వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. పది సంవత్సరాలుగా వారు చేసిన సేవలను అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ యాదారం ఇంద్ర, మండల కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ గౌస్ కొనియాడారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన నూతన ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, సుకన్య, నరేశ్, చంద్రకాంత్, కుమారస్వామిలకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మారెడ్డి, అర్జున్, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో ..



చేగుంట(తూప్రాన్): చేగుంట పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు

కలెక్టరేట్ ముట్టడి భగ్నం

నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వగా పోలీసులు భగ్నం చేశారు. ముఖ్య నేతలు, నాయకులను ఎక్కడికక్కడ ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. గురువారం అర్ధరాత్రే కొంత మందిని అధీనంలోకి తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై పలువురిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. అరెస్టులు చేసినా ప్రజల సమస్యలపై నిరంతరంగా పోరాటం చేస్తామన్నారు.

– నెట్‌వర్క్



శివ్వంపేట(నర్సాపూర్)లో..



కాడిపల్లిలో...

ఇన్‌స్పైర్ దరఖాస్తుపై నేడు అవగాహన

మెదక్ కలెక్టరేట్: ఇన్‌స్పైర్ అవార్డులు 2024–25 విద్యా సంవత్సరం ఆన్‌లైన్ దరఖాస్తుపై నేడు టీశాట్ చానల్ ద్వారా అవగాహన కార్యక్రమం ఉంటుందని డీఈఓ రాధాకిషన్ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ గాజర్ల రమేశ్, విషయ నిపుణులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లాలోని 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, భౌతిక, రసాయన శాస్త్ర, జీవశాస్త్ర, గణిత, ఇతర ఆసక్తి గల ఉపాధ్యాయులు తప్పకుండా పాల్గొనాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎంఓ సుదర్శనమూర్తిని సంప్రదించాలని తెలిపారు.

నేలకు జీవం పీఎస్‌బీ

- భూమికి సారం..
- జీవన ఎరువు వాడితే.. మొక్కకు అందనున్న భాస్వరం
- పోషకాలు మెండు.. అధిక దిగుబడి
- తగ్గనున్న రైతు ఖర్చు
- వరి నాట్లు వేస్తున్న రైతులకు కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ సూచనలు



కౌడిపల్లి(నర్సాపూర్): జీవన ఎరువు పంటకు పోషకాలను అందించి రైతులకు ఖర్చు తగ్గిస్తుంది. అధిక దిగుబడులు వచ్చేలా చేస్తుంది. నేలలో కరగకుండా ఉన్న భాస్వరాన్ని పీఎస్‌బీ జీవన ఎరువు వాడితే మొక్కలకు ఇది అందుతుంది అని కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ తెలిపారు. వరి నాట్లు వేస్తున్నందున రైతులు పీఎస్‌బీ వాడకంపై వివరాలు తెలిపారు. ఆయన మాటల్లోనే..

భాస్వరం కరిగించే పీఎస్‌బీ

నేల స్వభావాన్ని బట్టి భాస్వరం నేలలో గడ్డలు కట్టి కరగకుండా ఉంటుంది. దీంతో రైతు అదనంగా ఖర్చులు చేయాల్సి వస్తుంది. పీఎస్‌బీ (పాస్పరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియా) జీవన ఎరువు వాడితే నేలలో కరగకుండా ఉన్న భాస్వరాన్ని మొక్కలకు అందిస్తుంది. నేల స్వాభావాన్ని బట్టి



వరి నారుమడి



పీఎస్‌బీ జీవన ఎరువులో ముంచిన వరినారు

ఆమ్ల గుణం కలిగి ఉంటే ఇనుము లేదా అల్యూమినియం పాస్ఫేట్లుగా, క్షార గుణం కలిగి ఉంటే కాల్షియం లేదా మెగ్నీషియం పాస్ఫేట్లుగా మారి మొక్కకు అందకుండా నేలలో గడ్డలుగా పేరుకుపోతుంది. పీఎస్‌బీ దాన్ని కరిగించి మొక్కలకు అందేలా చేస్తుంది.

వాడే విధానం

పీఎస్‌బీ వాడటంతో నేలలోని భాస్వరం కరిగి మొక్కకు అందుతుంది. దీంతో నేల సారవంతమవుతుంది. దీని కోసం ఎకరాకు లీటరు పీఎస్‌బీ జీవన ఎరువును బాగా కుళ్లిన 200 కిలోల పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువులో కలుపుకోవాలి. దీనిపై కొద్దిమోతాదులో నీటిని చల్లుతూ తేమ ఆరిపోకుండా 15 రోజుల వరకు ఉండనివ్వాలి. తర్వాత పొలంలో చల్లుకోవాలి. నేలలో కలిసిపోయి మొక్కు అందకుండా ఉన్న భాస్వరాన్ని కరిగించి అందేలా చేస్తుంది.

విత్తన శుద్ధి

రైతులు విత్తన శుద్ధి చేస్తే రోగనిరోధక శక్తి పెరగుతుంది. పంట తెగులు ఇతర వ్యాధులను తట్టుకుంటుంది. దీంతో రైతుకు మేలు జరుగుతుంది. కిలో విత్తనానికి 10మి.లీ. పీఎస్‌బీ జీవన ఎరువును బెల్లం లేదా గంజి జిగట పదార్థంలో కలిపి నీడలో ఆరబెట్టాలి. తరువాత పొలంలో విత్తుకోవాలి.

వరి నారు వేర్ల శుద్ధి

ఒక లీటరు పీఎస్‌బీ జీవన ఎరువును 70 శాతం నీటిలో కలిపి నారుమడిలో చిన్న గుంత చేసి లేదా ప్లాస్టిక్ బ్యారిల్‌లో పోయాలి. ఇందులో పీకిన వరి నారును వేర్లు మునిగేలా 10–15 నిమిషాల ముంచి ఉంచి తరువాత నాటాలి. దీంతో నారు శుద్ధి అయి రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రైతులకు జీవన ఎరువుల వాడకంపై సందేహాలు ఉంటే కేవీకేలో సంప్రదించాలి. పీఎస్‌బీ జీవన ఎరువులు కేవీకేలో అందుబాటులో ఉన్నాయి.

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నర్సాపూర్: లోక్‌సభ ప్రతిపక్ష నేత కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు శుక్రవారం సీఐ జాన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మల్లేశ్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేశ్, రెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్ తదితరులు ఫిర్యాదు చేశారు. రాహుల్‌గాంధీ పరువు ప్రతిష్ఠలకు భంగం కల్గించేలా దిగజారుడు పోస్టులు పెడుతున్న వ్యక్తులతో పాటు ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.



సీఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రతినిధులు, పార్టీ నాయకులు

నంబర్ ప్లేట్ లేని బైక్‌లు సీజ్

చిన్నశంకరంపేట(మెదక్): నంబర్ ప్లేట్ లేని బైక్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మెదక్ రోడ్డుపై వాహనాల తనిఖీ చేసిన పోలీసులు నంబర్ ప్లేట్ లేని ఐదు బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు బీమా కలిగి ఉండాలని సూచించారు. లేదా నూతన వాహన చట్టం ప్రకారం భారీ జరిమానా విధించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొంది.



నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసిన పోలీస్‌లు

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని డీసీఆర్‌బీ (డిస్ట్రిక్ క్రైం రికార్డ్స్ బ్యూరో) సీఐ మధుసూధన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతన చట్టాలు, షీటీం, మహిళల భరోసాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. మహిళలు, విద్యార్థినులకు ప్రేమ, లైంగిక వేధింపులు ఉంటే షీటీం, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భగీరథ నీటి నాణ్యత పరిశీలన

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రాంత ప్రజలకు సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటి నాణ్యతను జైజీవన్ మిషన్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని శభాష్‌పల్లిలో నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరిశీలించి నమూనాలను సేకరించారు. ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్, నీటి సరఫరా తదితర విషయాల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ సభ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీప్రసాద్, కార్యదర్శి వీణ పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండండి

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



కుటుంబీకులను పరామర్శిస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

రేగోడ్(మెదక్): అధైర్య పడొద్దని అండగా ఉంటామని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మండలంలోని తాటిపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్త కె. నాగయ్య గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకుని శుక్రవారం అతని ఇంటికి వెళ్లి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చయ్య, మండల ప్రధాన కార్యదర్శి సుంకే రమేశ్, మండల సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షుడు రవీందర్, తాటిపల్లి మాజీ సర్పంచ్ సంగయ్య, మాజీ గ్రామ అధ్యక్షులు మారుతీరావు, శేఖర్, బందప్ప, పుండరికం, ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

మోస్తరు వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వానలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం కురిసిన తేలిక పాటి వర్షానికి ఆరు తడి పంటలకు కొంత మేర మేలు చేకూర్చింది. భారీ వర్షాలు కురిస్తే తప్ప పంటలు సక్రమంగా పండే అవకాశం లేకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది.

అధికారుల బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈఓ రాధాకిషన్



బాధ్యతలు చేపడుతున్న బ్రహ్మాజీ

కొల్చారం(నర్సాపూర్): మండలం పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా విద్యాధికారి రాధాకిషన్ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఎంపీడీఓ లక్ష్మీ నర్సింహులు, ఎంఈఓ నీలకంఠం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాధాకిషన్ మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరీ సహకారంతో ముందుకు సాగుతానన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మహిపాల్ రెడ్డి, కార్యాలయం సూపరింటెండెంట్ విఠల్, జూనియర్ అసిస్టెంట్ రాకేశ్, నాయకులు కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల ప్రత్యేక అధికారిగా బ్రహ్మాజీ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. ప్రజలు సైతం పరిపాలనలో సహకరించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం ఉన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వివిధ శాఖల సిబ్బందితో కలిసి ఆయన సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యపు ధోరణి అవలంభించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయన్ను సన్మానించారు. ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది స్వామి, జీవన్, తదితరులు ఉన్నారు.

సింగరేణికే బొగ్గు బ్లాక్‌లు

కేటాయించాలని అదనపు కలెక్టర్‌కు సీపీఎం నేతల వినతి

మెదక్ కలెక్టరేట్: బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేసి నేరుగా సింగరేణికే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కే నర్సమ్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను నేరుగా సింగరేణికే కేటాయించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ప్రతి సంవత్సరం సుమారు రూ.8 వేల కోట్లు చెల్లిస్తోందన్నారు. పదేళ్లలో రూ.49 వేల కోట్లకు పైగా పన్నులు చెల్లించిందన్నారు. మైన్స్ మినరల్ యాక్ట్ లోని సెక్షన్ 17 ఏ ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు బొగ్గు బ్లాక్ ను కేటాయించాలని డిమాండ్ చేశారు. కానీ సింగరేణిని కూడా వేలంలో పాల్గొనాలని చెప్పడం అన్యాయం అన్నారు. వేలాన్ని వెంటనే ఆపాలని, లేకపోతే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బరిగే బస్వరాజు, కొరింకల మల్లేశం జిల్లా కమిటీ సభ్యులు సంతోశ్, నాయకులు లచ్చ గౌడ్, షౌకత్, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మనోహరాబాద్(తూప్రాన్): యుక్త వయసులో ఉన్న విద్యార్థులు, కళాశాల విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కూచారం గ్రామం కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల జరిగే దుష్పరిణామాల గురించి తెలిపారు. విద్యార్థులు తమ కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

మెదక్ మున్సిపాలిటీ: ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకీరామ్‌సాగర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో గల 5, 16, 20వ వార్డుల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు ఆయా వార్డుల్లోని ప్రజలకు దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలైన పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరిబోండాలు, పూల ట్రేలు, నీటితొట్లు మొదలగు వాటిని ప్రతి శుక్రవారం ఒకసారి ఖాళీ చేయించి పొడిగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. తద్వారా దోమలు వృద్ధి చెందవని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలకు దూరంగా ఉంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు రేబిస్ వ్యాక్సినేషన్

రామాయంపేట(మెదక్): జూనోసిస్ డే సందర్భంగా శనివారం రామాయంపేట పశు సంవర్ధక శాఖ కార్యాలయం పరిధిలో కుక్కలు, పిల్లులకు రేబిస్ వ్యాధి నివారణ వ్యాక్సిన్లు ఇస్తామని ఆశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ తిరుపతి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో, గ్రామాలకు సంబంధించి కుక్కలు, పిల్లులను పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ మొక్కలు నాటే కార్యక్రమం

నర్సాపూర్: అమ్మ పేరుతో మొక్కలు నాటాలని ప్రధాని మోదీ పిలుపుతో తమ వార్డుల్లో మొక్కలు నాటామని నర్సాపూర్‌కు చెందిన బీజేపీ కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, రాజేందర్‌లు చెప్పారు. శుక్రవారం తమ వార్డుల్లో మొక్కలు నాటి వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో బుచ్చేశ్‌యాదవ్, రాజేందర్, ఆయా వార్డుల నాయకులు రమణారావు, చంద్రశేకర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం ఉన్నత పాఠశాలలో బీజేపీ నాయకులు శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా బీజేపీ దుబ్బాక నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ ప్రకాశ్ ముఖర్జీ ఆత్మబలిదాన్ పక్షోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు లావణ్య, బూత్ అధ్యక్షుడు ఆకుల నవీన్, సీనియర్ నాయకులు శ్రవణ్, సత్యం, విఠల్, శ్రీనివాస్, పెరుమళ్ల శ్రీను ఏబీవీపీ నాయకులు రాము, నవీన్, వినయ్, మనోజ్, సాయి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

◆ రోడ్డు నిబంధనలు పాటించాలి

పెద్దశంకరంపేట(మెదక్): వాహనదారులు తప్పకుండా రహదారి నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ.శంకర్ అన్నారు. శుక్రవారం కోళపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని, హెల్మెట్ ధరించాలని, వాహనాలకు నంబర్‌ప్లేట్ తప్పనిసరి అన్నారు.

◆ పారిశుద్ధ్య కార్మికుల భిక్షాటన

జగదేవ్‌పూర్(గజ్వేల్): బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని తిగుల్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. 2 నెలల నుంచి వేతనాలు ఇవ్వడంలేదని వాపోయారు. అధికారులు స్పందించాలన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264